# హింస

సంందవేళ, గోర్జలో అడుగుపెట్టేసరికి గారయ్యగారి మంద బేపి 'భవ్వ్' మంటూ మీద పడబోయింది. "శా...." అనికేకేసి చేతిలో సిలవరి చెంబు పైకెత్తగానే, యేఁవీఁ యెరగనట్టు వెనక్కెళ్లి పోయింది కుక్క.

"యెర్రిముండా! నీ యంబలి నాక్కావాలే!" అని కుక్కని చీవాట్లేసి, జడుసుకున్నందుకు "థూ థూ...." అంటూ ముమ్మారు గుండెలమీద ఊసుకుంది సంగి.

గోర్జకి రెండు పక్కలా పూరిళ్ళ వాసలు, కడుపులో మంటలు కణకణ లాడుతుండగా, ఎర్రని నల్లని ఆకారాలు ఆ మంజూర్లలో మసుల్తున్నాయి.

వాడకట్టు జనానికీ వెలుగూ చీకటీ ఒకటేనేమో, లేక వెలుక్కన్నా చీకటే దగ్గిరిదో, సంగి విసవిసా నడుస్తోంది వూళ్ళోకి.

"ఔనే. ఓలె బోడి! యెగవీదిని పుణుకుల సుబ్బయ్య దుకానం తెరిసుందా?" అంది సంగి.

"యేఁ వెందుకూ?" అంటూ యెదురు ప్రశ్నవేసింది బోడి.

ఇంకో అప్పుడైతే సంగికి కోపం వచ్చేదే. "నా నిటడగితె నువ్వటడుగుతావేఁ వేఁ? వుంటే వుందన్రాదా నేప్పోతే నేదన్రాదా" అంటూ తగువుకు దిగేది.

కాని యివేళ తగువు పెట్టుకోలేదు. ఎందుక్కావాలో చెప్పింది. బోడి మాత్రం తన బుద్ధి పోనిచ్చుకుంది కాదు. అంతావిని –

"యెళ్ళి చూసుకోయే" అంటూ వెళ్ళిపోయింది.

అప్పటికీ సంగికి కోపం రాలేదు.

"వొద్దోలమ్మ! మనిసికంత నెచ్చుకూడదు. పువ్వప్పుడే మిడిసి పడితే, పిందప్పుడే రాలిపోతారని సాఁవెత!" అంటూ ముందుకు పోయింది.

రెండడుగులు వేస్తే గోర్జ చివరొస్తుంది. మలుపు తిరిగితే కోఁవటి సీతయ్య కొట్టుంది. అక్కడికి పదిబార్లుంటుంది పుణుకుల సుబ్బయ్య దుకాణం.

కొట్టుమీద పెట్రుమేక్సులైటు, కోఁవటాయన వ్యాపారంలాగే, జోరుగా వెనిగిపోతోంది. ఆ వెల్తుర్లో సంగి మెడలో పగడాలూ, పూసలూ మకిలి మకిలిగా మెరుస్తున్నాయి. దాన్ని వేలాడే కొత్త పిన్నీసులు జిగజిగలాడు తున్నాయి. అడుగడుక్కి వెలుతురు దగ్గిరకాగా, కళ్ళకీ, మొహానికీ కితకితలై, తల వోరగా పెట్టి నడుస్తోంది సంగి. కొట్టు దాటగానే, వెనకనున్న నీడ సర్రన తిరిగి ముందుకొచ్చింది. బారెడు గోచిగుడ్డ మొలకు చుట్టుకొన్న బ్రహ్మరాక్షసిలాటి నీడన్చూసి, "శా, పయ్యాట గుడ్డ మరసి పోనాను!" అనుకుంది సంగి.

★ ★ ★

పుణుకుల సుబ్బయ్య తన కొట్టుకి యిటీవల పెట్టుకున్న పేరు "శ్రీ వీర వేంకట సత్యనారాయణా విలాస్ కాఫీ క్లబ్బు" పెద్ద వీధికి సెంటర్లో వుంటుందని చాకలి యర్రయ్య పశువుల పాకని చదును చేయించి బోర్డు తగిలించేడు. బేరఁవున్నా లేకున్నా జాఁవురాత్తిరిదాకా కొట్టు ముయ్యడు. ఎవరేనా ప్రశ్నిస్తే–

"నీకు తెల్దు, పొద్దల్లా అమ్మేది ముత్తుఁవైతే, పొద్దోయి అమ్మేంది పందుం" అంటాడు సుబ్బయ్య.

ఏటంటే "గ్యాస్" అంటాడు దాసు.

సుబ్బయ్య తానో పెద్ద "యిగటదారి" ననుకుంటాడు. తను వెలిగేచోట యింకోళ్ళు వెలిగితే వొప్పుడు దాసు. అతడు కొట్లో వున్నంతసేపూ, సుబ్బయ్యా గల్లాపెట్టిమీద కూడా అధికారం దాసుదే.

దాసుకి పిల్లలున్నారు కాని పెళ్ళం లేదు. పిల్లల్ని పెంచడానికి ఓ అత్తా, అడిగినప్పుడల్లా డబ్బులివ్వడానికో వొదినా వున్నారు. అంచేత, అతడు పట్నంలో వుండనప్పుడల్లా సుబ్బయ్యా హోటల్లోనే వుంటాడు. సుబ్బయ్య అడ్డమైన గడ్డిలోంచీ అంతో యింతో సొమ్ములాగినట్టే, దాసు ఉనికివల్ల కూడా కొంత సొమ్ము చేసుకోగలడు.

కొత్తకారు కుర్రాళ్ళు "సువ్వో ట్రాన్సిస్టరైనా కొనవుర, దద్దా!" అంటారు. "ఎందుకు మన దాసులేడా? యెయ్యి రేడియోల పెట్టు!" అంటాడు సుబ్బయ్య తడుముకోకుండా. కుర్రాళ్ళు కూడా వొప్పేసుకుంటారు.

నిజఁవే. దాసున్నచోట రేడియోలూ, గీడియోలూ అఖ్ఖర్లేదు. చెప్పిన ముచ్చట చెప్పకుండా యేళ్ళ తరబడి చెప్పగలడు. నవ్వుల బండి! నడిచే గ్రామఫోన్. కపిలవాయి రాఁవనాథశాస్త్రి దగ్గర్నుండి ఘంటసాల దాకా, అందర్నీ అనుకరించగలడు.

సంగి పుణుకుల సుబ్బయ్య టీ కొట్టు చేరుకొనే ముందు, దాసు ఓ ముచ్చట చెపుతున్నాడు.

"....అయితే – ఏషఁవెలాగుంది తెల్సా? యే కాలేజీగర్లూ – ఆన్దు; ఆ – లోకటింగ్ మెడా, ఆ మినీకట్టు బేకూ, లంగామీద వోణీ, జానాబెత్తెడు పైటా – చాతీ ముందుకు తోసేసి నడుం నిటారుగ నిలబెట్టి, కింద భాగం అలా అలా వూపుతూ నడుచుకొస్తోంది. చేతిలో చూద్దుఁవంటె పావలా పరక కేన్వాస్‌బేగ్ పట్టుకుంది.

"ఎవర్రా! యెవతిది హెల్తు విజిటరెవత్తేనా కొత్తగా దిగుతోందా?" అనుకుంటూ, ఆ యెంబడే నడుస్తున్నాను. పణుకుల్చెరువు దాటనిచ్చి, జడిప్పుతోంది. ఇదేట్రా, నడ్రోడ్డుమీద జడిప్పుతోందనుకున్నాను. ఆ యెనక గోర్జిలోకి రాగానే, పెండెల్లోకి దారితీసింది. అప్పటికీ నాకనుమానం యెయ్యలేదు. ఏదో, ఆడపిల్ల మరుక్కెళ్ళిందనుకున్నాను. నేనూ పెండె దాటు తున్నాను. ఆ పక్క కమ్మల కుప్పల్లేవా – ఆటి మధ్య, యిలాగ వొంగోని రైకిప్పుతోంది. ఇంక చెప్పొద్దా, నా కనుమానం ఏసింది.

ఐతే మన పనేలాగుంది – అప్పటికే మూడ్రోజులై పట్నంలో మకాం! యిలాగ, కాళ్ళు పీక్కుపోయి, కళ్ళు లోతుకుపోయి, జేబిలో డబ్బులన్నీ చెల్లిపోయి – యెప్పుడు యెప్పుడొచ్చి కొంపను పడతాను! యిన్ని మెతుకుల్తిని యెప్పుడు మంచం మీద వాల్తానా – అన్నట్టుంది. అలాట్టయ్యంలో యిది! అయితే, కడుపు నిండిన పులైనా నరవాసన తగిల్తె అణుచుకోలేనట్టు, మనసు అటూ యిటూ అటూ కొట్టుకుపోతోంది.

ఇంతలో గంట "టింగ్ టింగ్" లాడించుకుంటూ, బొక్కి సైకిలు బర్రూ బర్రూ, లాడిస్తూ యేనుగ్గున్నలా వొచ్చేస్తున్నాడు – యండాడ సత్తెం. అతగాడ్ని "ఓహో" అంటే "ఓహో" అని సాగనంపేసరికి యెనకనుండి యిద్దరు వుప్పు కావిడోళ్ళు దిగడ్డారు. ఆళ్ళూ పోయినారనుకుంటే దడదడ లాడుతూ వచ్చి దబ్బున దిగబడింది యిసకలో – యేటి? గెత్తబ్బండి".

గొల్లుమన్నారు వింటున్నవాళ్ళు.

హమ్మా! యిహ లాభం లేదురా అని తిరిగిపోయేను. అయితే కాళ్ళు ముందుకు పడవు.

యెవత్తిది? యెవత్తెయితే మాత్రం యెనకా ముందూ సూడకుండా పెండిల్లో కెలాగెల్లింది? అంటే, దీనికి ఈ మట్టి కొత్త కాదన్నమాట! మనం వెరగని గడేకారి ఈ మట్టిలో యెవతుంది? సరే, యెవతో వుంది. పెండిల్లో కెందుకెళ్ళినట్టు? మన కోసవేం అనుకోడానికి, స్టేషను దాటింది లగాయితూ, ఒకపాలీ తిరిగి సూళ్ళేదే! సూడకపోతే యెవరికోసం యెళ్ళింది? యెవరికోసం కాప్పోతే రైకేల యిప్పాల?

"ఇలా తర్జన భర్జన చేసుకుంటూ, నాలుగడుగులేశాను. మళ్ళా యెనక్కి చూస్తే పెండిల్లోని మనిషి గబగబొచ్చేస్తోంది".

"ఆ" అన్నాడొకడు.

"సూద్దును మనిసి యేషం పూరా మారిపోయింది".

"అంటే."

"ఆ మనిసొంటి మీద ఆ రైకా లేదు, అప్పుడేసుకున్న ఆ వోణీ లేదు. ముందు కట్టిన లంగా లేదు".

"మరి!!!"

"అయన్నీ యిప్పి సంచిలో దాచేసింది. సుట్టు కుచ్చిళ్ళ కోక్కట్టి, వొంటిమీద బాడీ కూడా తీసేసింది. సంచి సేత్తో పట్టుకుని, జర్జరొచ్చే స్తోంది".

"ఆ మనిషేనా?"

"నేనూ అలాగే అనుమానపడ్డాను. అయితే నడకదే. మనిషి వాటంవదే. చేతిలో సంచీ – అదే; జడిప్పి మెట్టకొప్పొకటి ముడిచింది".

"ఏంవెందుకు?"

"ఎళ్ళి అడుగురా – మీ యీదికి దగ్గిరే ఉందట" అన్నాడు దాసు. అడిగిన వాడు కుర్రవాడవడంతో అంతా ఘొల్లుమన్నారు.

అదొకపాలి యెనక్కి తిరిగుంటె దాన్ని పోల్చేసి వుండునన్నాడు తెలికల తవిటయ్య. మొహం సూసినా, పోల్చలేడన్నాడు కంసాలి సాంబం. ఏటి? – అంత మారిపోయిందేటి? అన్నాడు సుబ్బయ్య. మారిపోడంవా, యిలా గలాక్కాడు అంటూ వర్ణన ఆరంభించేడు గంవంళ్ళ సూరయ్య.

సుబ్బయ్య నోరు వెళ్ళబెట్టుకు వింటుంటే "ఆ బేరంవేదో సూడు" అన్నాడు దాసు.

….. సరిగ్గా అప్పుడే వచ్చి నించుంది సంగి.

★ ★ ★

పాక పొడుగునా, రెండు దిక్కులా రెండు మట్టి అరుగులున్నాయి. వాటి ముందు సరుగుడు కర్రల మీద బల్లచెక్కలేసి మేకుల్తాపిన టేబిళ్ళున్నాయి. ముందున ఎత్తుగా ఓ అరుగు, దానిమీద అద్దాల పెట్టెలో రొట్టెలూ, బిస్కెట్లూ, వాటికి పట్టిన కొన్ని కండచీమలూ వున్నాయి. ఆ పక్కన పకోడీల బేసినూ, పూరీకూరల గిన్నెలూ అడుగు మడుగుల్తో మురిగ్గా ఉన్నాయి. వాటి పక్కగా గల్లాపెట్టే, చుట్టూ చుట్టా, బీడీ, సిగరెట్ సామాన్ల చిల్లర దొక్కులూ వున్నాయి. పాకకి అవతల చివర తడికల్తో తయారైన కిచనుంది. ఓల్డు మోడలు పెద్దసైజు బర్నరు లాంపు వెలుగులో జనం అన్నిదిక్కులా కూర్చున్నారు.

"ఏంవే గుంట! యేటి కావాల?" అన్నాడు సుబ్బయ్య.

"రెండు గళాసుల టియ్ యియ్యమంది మాయమ్మ" అంటూ సిలవరి చెంబు చూపింది సంగి.

"సంపినావే" అన్నాడు సుబ్బయ్య. "పాలైపోయినాయ్" అని బొంకుదునా అనుకున్నాడు కొంతసేపు. కాని "పావలా డబ్బులు మాత్రం యెలా వస్తాయి?" అనుకుంటూ కూచున్న చోట్నుంచి మూలుగుతూ లేచేడు. తగ్గించి వుంచిన లాంతరు హెచ్చిస్తూ తడిక వెనక్కెళ్ళేడు.

"ఔనే, ఓలె గుంట! నువ్వెవళ బొట్టివే?" అన్నాడు దాసు.

కొట్టుంటుందో, మూసేస్తారో? వుంటే…. పాలుంటాయో, ఐపోతాయో, అవప్పోతే – టీ సేసిస్తానంటాడో, బద్ధకిస్తాడో?

... ఇలా లక్ష అనుమానాల్తో వచ్చిన సంగికి టీ దొరుకుతుందనే భరోసా కలగ్గానే కొండెక్కినంత సంతోషఁ వయ్యింది. సొమ్ము తీసుకునే అయినా – ఆ రాత్రప్పుడు టీ చేసి యిస్తున్న సుబ్బయ్యా, సరదాగా మాటాడుతున్న ఆ మనిషీ, బేరం చూడమని పంపిన ఆ పెద్దమనుషులూ, చాలా మంచి వాళ్ళలా కనిపించేరు. అంచేతే....

"నానా? ఆవాల జగ్గమ్మ కూతుర్ని" అంది సంగి కలుపుగోలుగా.

ఆవాల జగ్గమ్మ పేరు వినగానే అక్కడున్న వాళ్ళంతా మొహ మొహాలు చూసుకున్నారు. దాసు, గఁవఁళ్ళ సూరయ్య వంక "అవునా?" అన్నట్టు చూడగా "అవునదే" అన్నట్టు తమాషాగా తల కదిపేడు సూరయ్య.

"అఁవునే – ఆవాల పైడమ్మ నీకేఁవవుద్ది?" అన్నాడు దాసు.

"మా యప్పే" అంది సంగి ఆత్రతగా.

ఆ గొంతు వినగానే దాసు కళ్ళు ఒక్కక్షణం మెరిసేయి. వెంటనే బోల్డు ఆశ్చర్యపడిపోతున్నట్టు చూసేడు.

"ఓలె గుంటా, నువ్వు ఆవాలపైడి సెల్లెలివా! సెప్పవేం? యిలా రా యిలా రా" అన్నాడు దాసు.

దాసులాటి పెద్దల్ని వూరంతా యెరిగుంటారు. వాళ్ళకి వూరందర్నీ తెలిసుంటుందని సంగి అనుకోలేదు. అంచేత అనుమానంగా చూస్తూ అక్కడే వుండిపోయింది.

దాసు మళ్ళా మళ్ళా పిలుస్తుంటే "వోలె, యెల్లే గుంటా! యినపడదేటి? పెద్దోళ్ళ సేత అన్నిసార్లు పిలిపించుకోకూడదు" అంటూ కొందరు చీవాట్లేసేరు.

దాంతో సంగి బెరుగ్గా కదిలి చురుగ్గా దగ్గిరికెళ్ళింది. దాసు ఆమెను సొంత బంధువులమ్మాయిలా దగ్గిరికి తీసుకున్నాడు. "అవునే, నీ పేరేం పేరు?" అంటూ ఆరంభించి కొంతసేపు దాని సొంత భోగట్టాలడిగేడు.

"యీ పొగడాల తావళం యెక్కడిదే?" అంటూ ఆ తావళం కొంతసేపు సవరించేడు.

"ఈ పిన్నీసులూ నాకెరువిస్తా?" అంటూ మెడమీచ్చెయ్యేసి, చెవిలో యేదో అన్నాడు. దాన్ని కవ్వించి నవ్వించి అప్పుడు అసలు ప్రశ్నలు బయటికొదిలేడు.

సంగికి "తంఁడ్రి – సిన్నప్పుడే పోనాడు" పైడమ్మ కాక, "యింక అప్పసెల్లెలు నేరు" అన్న ఒకడున్నాడు కాని, "ఆడు ఇల్లరికం పోనాడు". "ఆడిల్లోగ్గేసింది. తగువులొచ్చి కాదు. ఆళ్ళమ్మ అసలెవ్వరితో తగోలాడదు." అక్కడ్నించి వాళ్ళన్న – "యేం సాయం సెయ్యిడు; సెయ్య దానికి ఆడికే యింకోళ్ళు గంజిపొయ్యాల". "ఆళ్ళన్న – అప్పా సాయిం సెయ్యరు. సేతనైతే అప్పేసేసును గాని, దానికి సాగదు".

"ఏం? మీ బావొప్పడేటీ?" అన్నాడు దాసు.

జవాబు చెప్పడానికి ఒక క్షణం ఆలోచించింది సంగి. అంత అభిమానంగా మాటాడేచోట, మర్మం పెట్టడం తప్పునిపించింది – ఆ పిల్లకి.

"మాయప్ప మా బావ నొగ్గేసింది" అంది కిందికి చూస్తూ.

ఆ మొహం చూసేక దాసువంటి పెద్దమనిషిక్కూడా "ఏఁవీఁ" అని కెలకటానికి నోరొచ్చింది కాదు.

"మారు మనుఁవు సూసుకుందేటే?" అన్నాడు అదో పెద్ద తప్పు కాదన్నట్టు.

సంగి లేదంది తలతిప్పుతూ.

"అయితే, యిప్పుడెక్కడుంది?"

"యిశాపట్టం".

"మరి బువ్వో?"

"కూలి సేస్తాది" అంది తలెత్తి.

దాసు తలెత్తకుండానే అందరి వంకా చూసేడు. అందరూ చెవులు రిక్కించి వింటున్నారు.

"ఇప్పుడక్కడే వుంటోందా?" అన్నాడు బెల్లిస్తూ.

అవునన్నట్లు తలూపి "సూణ్ణానికొచ్చింది" అంది సవరణగా.

"ఎప్పుడే?" అన్నాడు చాలా మంచి వార్త వింటున్నట్లు.

"నిన్నపొద్దోయి" అంది అదేవిధంగా.

ఇంతలో, చెంబుకోసం కేకేఁసేడు సుబ్బయ్య. సంగి వంటగది దగ్గిరికెళ్లి పోయింది.

దాసు ప్రశ్నలు అయిపోయేని గ్రహించాక.

"అవునే, మీ యప్ప తిన్నగ మీ యక్కడికే వొచ్చిందా, ముందు మీ పెద్దిగారింటి కెళ్ళిందా?" అన్నాడు గఁవఁళ్ళ సూరయ్య.

సంగికెంచేతో ఆ ప్రశ్న కోపం తెప్పించింది.

"నాకు తెల్దు. నాన్తొంగున్నాను" అంది తిరిగైనా చూడకుండా.

కమ్మని టీ వాసన ముక్కులోకీ, వేడి వేడి టీ చెంబు చేతిలోకి రాగానే పోయిన వుత్సాహమల్లా తిరిగొచ్చింది. చెంబు వుషారుగా చేతుల్లోకి మార్చుకుంటుంటే.

"అవునే! మీయప్ప నాఁళ్రోజులుంటాదా?" అన్నాడు దాసు.

"యేఁవో – వుంటాది" అంది.

"అయితే నన్నోపాలి కలియమని సెప్తావా?" అన్నాడు దాసు. "సెప్తాను" అంది సంగి ఆలోచించకుండా.

ఘొల్లుమన్న జనంతో గొంతుకలిపి పకపక నవ్వుతున్నాడు దాసు. వెనక్కి తిరిగిన సంగి కళ్ళలో అదరిపాటును దాసు గ్రహించలేదు.

★ ★ ★

టీ చల్లారిపోకముందే యిల్లు చేరుకోవాలని గబగబా నడుస్తోంది సంగి. సీతయ్య కిరాణాకొట్టు దాటుతుంటే...

"సంగమ్మో! ఓల్సంగమో! కసింతాగే – నానూ వొస్తాను" అంటూ నీలమ్మ పిలుపు వినపడింది. అంత తొందర్లోనూ ఠక్కున ఆగిపోయింది సంగి.

ఒక చేతిలో – జానెడు నూనెసీసా, చిన్న బెల్లంముక్కా; రెండో చేతిలో పట్టెడు చింతపండు వుండా పట్టుకుని, పరుగూ నడకగా వచ్చింది పదమూడేళ్ళ పిల్ల.

"అవునే, మీ యప్పొచ్చిందా?" అంది పలకరింపుగా.

సంగి "వొచ్చింది" అంది అటు తిరిగి నడుస్తూ.

రెండడుగులేసి....

"యేఁవలాగున్నా?" అంది నీలి.

"పొద్దుట్నుండి ముమ్మారొచ్చినాను – నీతో సెప్పనాఁనికి" సంగి మాటలో నిష్ఠూరం వుంది.

ముమ్మారొచ్చినా తను దొరక్కపోడానికి కారణఁవేఁవో చెప్తోంది నీలమ్మ!....

అడివవతల బుడుఁవూరు సోఁవయ్య శేరీకి తనూ తల్లీ పప్పేత కెళ్ళేరు. రానూ పోనూ ఆరు మైళ్ళు. ఏకువనగా నెగిసి పాసిపనంతా సేసుకుని యింటికిపడ్డ నీళ్ళన్ని మోసి ఆడుతూ బడుతూ యెల్తే యియ్యేళకు తేలేరు.

"ఆ ముదనష్టపోడు దీపాలెట్టిందాకా వొగ్గినాడు కాడొలె" అంది నీలమ్మ.

నీలను అందికాని, యింట్లో యింట్లో మనిషే కదా సంగి. అప్పొచ్చి ఓ రాత్రి ఓ పగలూ గడిచినా, ఆమె కూడా నిండా వో గడియపాటు దగ్గర కూకోడఁవయింది కాదు.

ముందుట్రోజు కూలాడక, కసిన్ని బియ్యం వుంటే దీపాలెట్టక ముందే, తల్లీ కూతురూ గంజి కాచుకు తాగేశారు. పగలల్లా కంపకోసం యెండలో తిరిగిందేఁవో, సందేళకే నిద్దరొచ్చింది సంగికి.

ఓ రాత్రప్పుడు కడుప్పొంగి, వాకిటకు లేచింది సంగి. వొళ్ళల్లా నొప్పులు, కళ్ళు బరువులు, కడుపులో ఆర్చుకుపోయిన పేగులు. తడుము కుంటూ వెళ్ళి తలుపు తీసింది. గుమ్మంలో మనిషి తొంగునుంటే, యెర్రి శిమ్మాద్రి అనుకుని చటుక్కున తలుపేసే బోయింది. అలికిడికి లేచి "యెవ్వళ్ళది?" అంది తల్లి.

"యేఁవిక్కడ తొంగున్నా?" అంటూ యివతలకొచ్చింది. "యింట్లో జాగా నేదు. అప్పొచ్చింది కదా! పెద్దమ్మకూడ యిక్కడే తొంగుంది" మగతగా జవాబిచ్చి మళ్ళా నిద్రలో పడింది తల్లి. అప్పొచ్చిందంటే, అర్థం చేసుకోడానికి కొంతసేపు పట్టింది సంగికి.

వాకిటవున్న ఒక్క క్షణం వేయి యుగాలుగా తోచింది. గబగబా వెళ్ళి తలుపేసేసింది.

చీకట్లో కాళ్ళమీద కూర్చుని తడుములాడుతుంటే, యెవరిదో తల దొరికింది. "మీ యప్పుకోసఁవేటే? అటుకాసి తొంగుంది, సూడు" అంది పెద్దమ్మ. మరునిమిషంలో, అప్ప వెచ్చని రక్తం ఆమె నాళనాళానా వేడిమి నింపుతూ ఆమెను పొదువుకు పోతోంది.

"అప్పా! వోలప్పా" అని లేపుతుంటే, "వోలుండనియ్యే రెండు రాత్తులై నిద్దర్లేదట" – అంటూ పెద్దమ్మ దెబ్బలాడింది. నిద్దట్లోనే అక్క కావలించుకోగా వొదిగిపోయింది సంగి.

తెల్లారేక యిలా నీళ్ళైనా పుక్కిలించలేదు. సిన్నాయిన కూతురు పారొచ్చింది. కాపోళ్ళ గుడ్డెల మీద గడ్డలు పగలెయ్యాలిట! వొస్తదేమో కనుక్కోమంది సిన్నమ్మ. "యేఁలాదూ? మారాజులా గొస్తాది. తీసుకెల్ల"ంది తల్లి. అంబళ్ళేలకు పనైపోదా అనుకుంది సంగి. కాని గుడ్డెలమీదే పొద్దు పోయింది, తిరిగివొచ్చింది లగాయతు దినవెచ్చాలు, తల్లికి వంటసాయం, ఇప్పుడు టీ.

"ఏఁవీఁ, మీ యప్ప రెంర్రోజులుండదేటే?" అంది నీలమ్మ.

"ఏఁవో. వుంటాదో, వుండదో, నాకడగడానికే తీరడం నేదు" అంది సంగి.

ఇంతలో నీల వుండే సందొచ్చింది.

"ఐతే నా నెప్పడొద్దునూ?" అంది నీలి.

"యేఁవిప్పుడు రారాదేటి?" అంది సంగి.

నీలి గొప్ప చిక్కులో పడింది. వాళ్ళమ్మ పెద్ద తప్పట్టదు కాని, ముసిలిముండ మా కాన్ది, పొద్దుగుంకిన్తరవాత బైటకెల్తొప్పదు. అందులో ఆళ్ళింటి కంటె అసలొప్పదు.

"రేపు మాకెక్కడ కూల్లునేవు. సల్దులేల కొస్తాను. ఓ సిటం మాటా మంతీ ఆడుకున్నాక, అడివికేసి శలక్కెల్దుం. మీ యప్పుకి తాటి తేఁగలంటే మనసుకదా! అలాగ తేగలు తవ్వుకు రావొచ్చు. మద్దేనేలకి గడ్డి కోసు కొస్తాం" అంది నీలమ్మ.

నీలమ్మ ఆ వెంటనే తనతో రానందుకు సంగికి కోపం వచ్చింది. అయితే అది బయటకు పెట్టలేదు.

"రేపిటికి నాకు తీరికైతే సూద్దులే" అంటూ తిరిగైన చూడకుండా, వాళ్ళ వీధికేసి వెళ్ళిపోయింది సంగి.

★ ★ ★

కొన్ని యిళ్ళలో వంటలైపోవడంతో, గొల్లవీధి సందులు మరీ చీకట్లుగా వున్నాయి. కుండలు కడిగిన నీళ్ళూ, పశువులూ మనుషుల రొచ్చులూ, రాత్తుళ్ళు ఆడంగుల నీళ్ళపోతల్తో – సందు చితచితలాడు తోంది. ఎగుడు దిగుడు సగం సగం తేలిక బండరాళ్ళ మీద సంగి చూసుకొని అడుగులేస్తోంది.

"ఓయ్ దేఁవుఁడ! నానేం సేతునో... వోయ్ దేఁవుఁడ. నానేం సేతునూ..." అంటూ దేఁవుడ్ని పలవిస్తోందో ఆడగొంతు.

సంగి జారిపడబోయి, ఆచుకుని ఆత్రుతగా నడిచింది యింటికేసి – దడదడలాడే గుండెతో, జవజవలాడే కాళ్ళతో, చూరు కిందినుంచి తొంగి చూసింది.

చుట్టు యిలారం పాకలోపల ముగ్గుర్నలుగు రాడవాళ్ళూ, చూరుకింద గడపలో – యిద్దరు మగవాళ్ళూ వున్నారు. చఁ వురు తక్కువ వెల్తుర్లో వాళ్ళంతా – జడిజడి నీడల్లా వున్నారు.

"నువ్వేం సేస్తావే, యెర్రిదాన! నువ్వేటి సెయ్యగలవ్! సెయ్యడానికేటైన మన సేతినుంది గనకా? ఏం సేసినా, ఆ బగమంతుడు ఆడే సెయ్యాల. నీ సేతిల నాసేతిల ఏట్నేదు" అంటోంది ఎదురింటి శగిడి సన్నేసమ్మ.

ఆమె మాటలు తల్లి వింటున్నట్టు లేదు. పాక మధ్యగా చతికిలబడి పోయి, నడింరాటకు చేరబడిపోయి, వేలాడిపోయే చేతులు – వొడిలో చేర్చుకుని, యెప్పుడో ఎనిమిదేళ్ళ క్రితం సంగి తండ్రి పోయినప్పుడు అలా కూచుంది. ఆవిడకెదురుగా – శగిడి సన్నేసమ్మా ఆ పక్కగా – పెద్దమ్మా – ఆమె వెనక – ఏడాది పిల్లడికి పాలిస్తూ, తల్లి చెల్లెలు పిన్నమ్మా కూచున్నారు.

"ఏం సెయ్యడానికెన నీ వశఁవా? నాలుగేళ్ళ కితందాకా నీ నట్టింట పెరిగిన బొట్టి. ఏణ్ణర్థం కితం పండుక్కి నీయింట పసుపూ కుంకం పుచ్చుకుంది. యియ్యాళ నియ్యింటికొస్తే, నట్టింట పీటేసి నాలుగు మెతుకులెట్టలేప్పోనావు. ఎవరో ఎరగన్దాని కెట్టినట్టు గుమ్మంలో ఆకేసి తిండెట్టినావు... ఏటుంది నీ సేతుల్లో?" అంది సన్నాసమ్మ.

ఆమె మాటలకెవరూ బదులు చెప్పలేదు. కొంతసేపు తనూ మతి పోయినట్టు నిలబడిపోయి, అప్పటికీ ఎవ్వరూ మాటాడకపోగా, తిన్నగా అప్ప దగ్గిరికెళ్లింది.. సంగి.

అప్ప – వాళ్ళకు ఎడంగా, చూరు గోడకు దగ్గరగా కూచుంది. ముడుకుల మీద చేతులు ముడుచుకుని, చేతుల మీద తల చేరేసీ, ఎవరికీ కనబడకుండా ఏడుస్తోందామె.

కొంచెంసేపు చూసి, "అప్పా! ఓలప్పా! యిదిగోనే టీయి" అంది సంగి.

పైడమ్మ అందుకోలేదు. పోనీ తలన్నా ఎత్తలేదు. మళ్ళా అనబోతే...

"అక్కడెక్కడో యెట్టే!" అంది సిన్నమ్మ గత్తురుకుంటూ.

ఆమెకంత కోపం దేనికో సంగికి తెలియలేదు. టీ చెంబు వుట్టిమీద వుంచేసి... వెళ్ళి పొదికట్టున కూచుంది పిల్లిలాగ.

గుమ్మఁవొద్దనే కూచున్నాడు చిన్నాయన. 'గూన్తాత'... పొగాకు ఊతులూస్తూ, చూరుకింద కూర్చున్నాడు. లోపల గోడవొద్దున కూచున్న అప్ప, వాళ్ళిద్దరికీ కనిపించడం లేదు. వాళ్ళ చూపులు బయటున్నాయి కాని చెవులన్నీ యింట్లోనే వున్నాయి.

"అసలిదంతా, ఆ కంసాలి గండడు సేసినాదప్పా" అంది సిన్నమ్మ – పాలు తాగుతున్న పిల్లోణ్ణి పాలొదిలించి, అడ్డాల్లో వేసుకుని కుదుపుతోంది.

"పాఁవులోడి మీదొచ్చిన కూనీకేసు లేదా, అందులో యీడు సాచ్చికాని కెల్లినాడు. ఆయేళే, దీనిమీద పోలీసులు కేసెట్టినారు. యిద్దరూ, ఆ కోరూట్ కాడ తారసపడి పోనారు. ఆ కాడికీ, నువ్వెవరో నానెరగనందిట. ఆ తొత్తుకొడుకప్పుడైన వూరుకోవాలా? దీనెంటున్న మొగోడ్ని మాయఁజేసి కూపీల్లాగేడు. మింకొస్తే మరేటి సేస్తాదీ? ... ఒప్పేసుకుంది" అంది సిన్నమ్మ వివరిస్తూ.

ఏడాది క్రితం అప్పగురించి ఏదో గొడవవడం, చాట్ని మాట్ని ఆడోళ్ళు వూసులేసుకోవడం యెవళో ఏదో అంటే, సిన్నమ్మ బంగారయ్య ఇంటి మీదకి తగూకెళ్ళడం – అదంతా సంగికి జ్ఞాపకం వచ్చింది.

"నా నానాడే అన్నాను. మా వుసురు, మా పిల్లుసురు తగిలి – ఏడాత్తిరక్కండ నీ యింట్ల ఎత్తిపోతలొత్తాయ కంసాలోడా అని. అన్నంద కార్నెల్లు దాట్నేదు, ఆడి పెద్ద కొడుక్కి సచ్చినంత పనయింది. అయితే ఆడి పాపం ఇంక పండనేదు".

"కంసాలోడి ననఁడఁవెందుకూ.... మన బంగారం మంచిదైతే ఆడేం సెయ్యగలడూ?" అన్నాడు చిన్నాయన.

"సావెఁత మా బాగా పొడిసినావు గాని, మన బంగారాని కేటొచ్చింది రయ్యా? ... కాదు, ఏటి లోటూ?" అంటూ ముదలకించింది పెద్దమ్మ.

"దాన్తల్లినాడు గాని, దానమ్మనాడు గాని, దాని యిటేడు తరాలా – దాని పిన్నమ్మలు, పెద్దమ్మలు, దాని సుట్టాలు, పక్కాలు – ఎవ్వరూ ఎవరి సేతా యేలెత్తి సూపించుకోలేదు మరి. మీ కాసి యేవరేనా వున్నారేఁవోఁ తండ్రివొంక సూట్టానిని నువు సెప్పాల!" అంది పెద్దమ్మ – చిన్నాయన్ని ఎత్తిపొడుస్తూ.

చిన్నాయన నోరెత్తక పోవడం చూసి, మళ్ళీ అంది. "ఆ సమ్మందం మీ రెండో అన్న తెచ్చినప్పుడే అన్నాను. ఒద్దురయ్యా! పాతూరు గొల్లలు మంచోళ్ళు కారూ, ఆళ్ళకీ మనకీ నప్పదురా, ఆళ్ళకి ఆ డబ్బే పావనంరా, మనకి నడిసిన నడత ముఖ్యంరా... అని సిలక్కి సెప్పినట్టు సెప్పేను. మీరూ, మీ వొదినా, 'ఆఁ, ఆళ్ళకి అంతుంది, యింతుంది, రెండు దుఁవ్వారాల యిల్లుంది. యాబయ్యో, అరవయ్యో మేకపిల్లలున్నాయి, దున్నుకోడానికో మడి సెక్కుంది. ఆ లెలాటోళ్ళైతే మనకేఁవిఁ? పిల్ల సుకపడద్ది'' అంటూ ఎగబడ్డారు.

పిల్ల కాపరానికెళ్లినప్పుడు దానికీ, దీనికీ సెప్పినాను. 'అమ్మా! నువు సూడబోతే సిన్నపిల్లవ్. నీ మొగుడు సూడబోతే అన్నదమ్ములందర్ల ఆడే నాదారి. కసింత మంకునాగున్నాడు. అలాటోళ్ళ నెదళ్ళ ఏ పురుగు దూరితే, ఆ పురుగే గాని ఇంకో

మాట సెవినెట్టరు. నిన్ను నీ యత్తోరు పొగాకు పన్లకు పంపుతావంటారు. నువ్వెంతమాత్రం వొప్పుకోకుమీ. నాకు పొగాకు వోసనపడదను. పంటకూలికైతే యెల్తానను. లేదంటారూ – యింట్లో పనిపాట్లు సూస్తానను. అంతేగాని, యెంత మాత్తరం పొగాకు పన్లకెల్లకు'... అని సిలక్కి సెప్పినట్టు సెప్పినాను. అలాగే అన్నారిద్దరూ. ఆ తరువాత ఈ సెవినిన్నది, ఆ సెవినొగ్గేసినారు" అంటూ తన చెల్లెలి కూతురు యెడల తనెంత బాధ్యత వహించినదీ వివరించింది పెద్దమ్మ.

ఆ తరవాత, పొగాకు పందిళ్ళలో, పొగాకు కొట్లలో పనిచేసే వాళ్ళు ఎలాగ చెడిపోతారో ఎందుకు చెడిపోతారో! అక్కడి డబ్బూ, ఆ కొట్లలో ఘాటూ మతులెలాగ చెడగొడతాయో – ఆ విషయాలన్నీ చెప్పింది పెద్దమ్మ.

"అవునూ, మరక్కడింకే కూల్లు దొరకవంట గదా. ఆళ్ళైనా యెందల పడతారూ?" అంది శగిడి సన్యాసమ్మ.

"నిజఁవే. మరిప్పుడేటయ్యింది?" అన్నది పిన్నమ్మ. కొంచెంసేపు సన్యాసమ్మ వేపు చూసి, మళ్ళీ అంది. "ముందు దీని రెండో తోటికోడలూ, నడిపాడబడుచూ మరుగడ్డారు. ఇదెల్లినాక ఇలాక్కాదురా అని దీన్నీ దించినారు. ఆర్రెంకు బయలల్లేదు. దీన్ది బయలడి పోనాది. సితకెక్క తన్ని ఇంట్లోంచి తగిలేసినారుగాని, మాటవరసకైనా మనతో సెప్పినారా?"

పొదికట్టున పిల్లిలా కూచున్న సంగి కిదంతా వింటూ వుంటే తనింకేదో లోకంలో వున్నట్టుంది.

తరువాత పాతూరు గొల్లలు ఎప్పుడెప్పుడెవడెవరికి యేయే అన్యాయాలు చేసిందీ చెప్పింది పెద్దమ్మ. కొంతసేపు చెప్పనిచ్చి...

"నన్నడిగితే, దాని కాపరం నిప్పులోసిన ఆ సావుకారు గండడి మాట అటుంచు. ఆ అత్తముండ దొరికితే మూతి పళ్ళిరగబొడిశీద్దును" అంది సిన్నమ్మ కసంతా కక్కుతూ. సంగికి ఆమె అంత కసిగా ఏలుండాలో బోధపళ్ళేదు.

అంతవరకూ వింటూ కూర్చున్న గూన్తాత – అతను సంగికి తల్లి వరస చుట్టాల్లో చిన్తాత అవుతాడు ... అప్పుడేఁ వనుకున్నాడో మరి, నోట వున్న పొగాకు వుమ్ము బయటకూసి, గుమ్మం దగ్గిరకి జరిగొచ్చేడు.

"ఇప్పుడా సదువంత ఎందుగ్గాని, జరగ వొలిసిందేటో – అది చూడు" అన్నాడు పెద్దమ్మతో. "మన పిల్లలోనే తప్పుందో, అత్తలోళ్ళ వొల్లే తప్పుందో మనఁవెరగఁవు. అత్తలోళ్ళదే తప్పని తేలినా ఇప్పుడు మనం సెయ్యగలిగిందీ లేదు. కడుపు దుగధ కొద్ది ఏటో అనుకుంటాఁవు. కాప్పోతే, మర్నాలుగు తిట్లు తిట్టుకుంటాఁవు.. అంతే. యిప్పుడు జరగ వల్సిందేటో, అదాలోసించండి" అని చుట్టకొస కొరికేడు గూన్తాత.

కొంతసేపు ఎవరూ మటాళ్ళేదు. ఆ తరవాత, పెద్దమ్మే అంది....

"ఆలోసించడానికీ, మాన్డానికీ ఇందులో ఏటుందీ? యెవరఁవాలోసించినా, యెంతాలోసించినా, యేసినడుగు యెనక్కి తియ్యడఁ వెలాగనే ఆలోసించాల. నన్నడిగితే, యెనకా గొయ్యే, ముందుగా గొయ్యే... ఇది, పరింకంప మీద పట్టుకోక అప్పా! తీసినా దక్కదు; తియ్యకున్నా దక్కదు" అంది సన్యాసమ్మతో.

"అవును మరి. యేటన్నానికీ నోర్రాదు. ఏం సెయ్యడానికీ కరసెరనా లాడవు" అంది సన్యాసమ్మ కూడా.

అలా వీధినిబడ్డ పైడమ్మ సాహసించి యింటికొచ్చేస్తే తీరిపోను. భయపడి పొరుగింటి చుట్టాలున్నారని పట్నం పోయింది. అక్కడ కూలీనాలీ చేసుకు బతుకుతూ కొన్నాళ్ళు పోయేక రావచ్చుననుకుంది. పట్నం మట్టితొక్కిన ఒంటరి ఆడది, వయసులో వున్నది, ఒకసారి కాలు జారింది – సాయిలా ఫాయిలాగా నెగ్గడఁవంటే– సామాన్యమా? కాదు. మొదట మోసానికి లొంగిన మనిషి, బలవంతానికి పడిపోయింది. ఆ పడ్డం, పడ్డం దిగజారి దిగజారి సబ్బారపు సంజీవమ్మ కంపెనీలో తేలింది.

"ఆ పట్టున అలాగొచ్చేస్తే, యేపాట్లో పడి, యే బొంకులో బొంకి, నలుగురం కమ్ముకుపోదువు. యిప్పుడు యేవఁ నడానికి, యెటు సెప్పడానికి యిషమ సందొచ్చింది" అన్నాడు గూన్తాత.

నలుగురూ కూడబలుక్కున్నట్టు, ఒక్కాసే లాగుతుంటే, సంగి తల్లి జగ్గమ్మకి రోషం వొచ్చింది.

"దానికంత తెలివతేటలే వుంటే, నిన్నూ నిన్నూ బతిఁ వాల్డఁవేలా? 'దేహీ' యని మీ యందరి పాదాలట్టుకోడఁ వేల" అందామె – రోషం గుండెల్లోనే దాచుకుంటూ.

దాంతో అంతా మళ్ళా తలలు వంచారు. ఎంత తలొంచినా వాళ్ళు చెప్పే దాంట్లో మార్పేలేదు.

"అదికాదే! నువ్వు కడుబ్బాద కొద్దీ లబోదిబో అనడవేఁ నా. జరిగేదీ జరగన్ది కానడం వుందా?" పెద్దమ్మ – చెల్లెలు జవాబివ్వక పోవడం చూసి – సన్యాసమ్మతో.

"అసలా గుంట వొద్దనే అంటోందప్పా! అది లోకం సూసిన మనిసి. దీనికి తలని పుట్టదూ – ఒకళ్ళు సెపితే యినిపించుకోదూ..." అంది పెద్దమ్మ.

"పేగు కదా?" అంది సన్యాసమ్మ ఆకాడికీ.

"పేగే. అయితే మించొచ్చినప్పుడేం జేస్తావూ? నయానో బయానో దాన్నుంచుతాఁవనుకో... దాన్నెక్కడెడతాది? యింట్లెట్టగల్దా?... యెట్టి లోకంతో సాలగల్దా? సాల్లెప్పోయినా తప్పుతాదా.. అంటావు. అసలా గుంట లోకంలో తలెత్తుకు తిరగ్గల్దా?... యెత్తుకోనో దించుకోనో తిరుగుతాదందాం. ఈ లోకం తిన్నగుడ్సిస్తాదా?.... నీ కళ్ళెదుట అది యింసపడ్డం

యేరు; కళ్ళ కనబడకండ యెక్కడో దాని పాటది పడ్డం యేరు. అందుకే ఆ గుంట ఒద్దంటోంది. దీనికి బోధపడదు" అని కొంతసేపాగి, "ఇప్పుడంటే, యింత మందిఁవి నీ గుమ్మాని కొచ్చినాఁవు. నీ కష్టఁవొచ్చినా, సుఖఁవొచ్చినా అప్పుడు మేం రాగల్తుఁవా? వస్తే – బతుగ్గల్తుఁవా?" అంది పెద్దమ్మ.

తలెత్తకపోయినా, తక్కినవాళ్ళు కూడా ఈ మాటలే అంటున్నట్టు కనబడ్డారు. జగ్గమ్మకు ఇంక ఆశలేదు గాక లేదని నమ్మకం కలిగిపోయింది. ఆమె గుండె దిగులుతో నిండిపోయింది.

"పోనీ, నువ్వే దాంతోపాటు పోతానంటావు. పాపపు కూడో, పరువు తక్కువ కూడో పిల్లలు, ఆళ్ళెట్టిందే పరమాన్నఁవు. నిజఁవే.... కానీ, మరీ గుంటో? ఈ గుంటొకటి వుంది కదా?" అంది పెద్దమ్మ సంగిని చూపుతూ.

ముక్కుపచ్చలారని తన కూతురు – సంగి – ఆమె బతుకు తలపున పడగానే, జగ్గమ్మకి శోకం ముంచుకొచ్చింది.

కట్టలు తెగిన ఆమె శోకానికి ఈసారెవరూ అడ్డుకట్టలు వెయ్యలేదు. వేసినా ఆగేది కాదా దుఃఖం. "ఓసి కూతురో! ఓ కూతురో!! ఓలమ్మో! నాయమ్మీ?" అంటూ గుండెలో గుబులంతా బయటకొచ్చేదాకా, గొంతు ఆర్చార్చి, వెలుగు రాసే దాకా యేడ్చేడ్చి సొమ్మసిల్లి వూరుకుంది జగ్గమ్మ.

★ ★ ★

రాత్రి ఎక్కడ నిద్రపోయిందో, యెలా నిద్రపోయిందో గుర్తులేదు సంగికి. ఉదయం కళ్ళు విప్పేసరికి చుట్టూ నిశ్శబ్దంగా వుంది. చీకటీ వెలుగూ నిండిన పాకలో తను తప్ప యింకెవ్వరూ లేరు.

ఎప్పుడో యిక్ష్వాకుల నాటి తలుపూ, ద్వారబంధం – దాని సందుల్లోంచి వెలుగు రేఖలుగా విచ్చుకుంటోంది. చుట్టూ గుడిసె నడికప్పు మీద కాణీ అంత కన్నముంది. అందులోంచి వెలుగు ధారగా జార్తోంది.

అప్ప వెళ్ళిపోయిందనే విషయం ఎవరూ చెప్పకుండానే మనసున పడగా ఎక్కణ్ణుంచో మొయ్యలేని దిగులు ముంచుకొచ్చింది సంగికి. ఒక్కక్షణం చిన్నప్పట్లా, బావురుమని ఏడవాలనుకుంది. కాని, ఏడవడం సంగికి నప్పదు.

తలుపు సందుల్లోంచి వేళ్ళు పెట్టి గొలుసు వూడదీసింది. ముఖం కడుక్కుని పుట్టిమీది చట్టి దించితే, దానికింద సిలవరి గిన్నెలో చల్లంది వుంది. "తల్లి కూలికి పోయిందో, అప్పని అంపకం పెడుతోందో" అనుకుంటూ – ఆ కసిన్ని మెతుకులూ తిని, తరవాణి తాగేసింది సంగి.

ఆ వేళ యింకెవర్నీ చూడదలచుకోలేదు సంగి. ఎవరితో మాట్లాడ్డానికీ మనసొప్పడం లేదు. లోపల గడియ పెట్టుకుని, నడిమి నిట్రాట నానుకుని ఒంటరిగా కూచుందా పిల్ల.

...... నిన్న రాత్రి ఇక్కడే కూచుని తల్లి ఏడ్చింది. ఉన్నదొక్క రోజు. ఆ వొక్కరోజైనా అప్పకి సరదాగా గడవలేదు. ఉదయం లేస్తూనే తనూ, అప్పా, ఏం కలిసున్నారో – ఓ అరగంట కలిసున్నారు. యింకా కొత్త తీరే లేదు. తను కూలికి పోయింది.

....అప్పనేదో అంతా వింతగా, కొత్తగా పై మనిషిలా చూసేరు. అప్పలో మార్పు ఏదో సంగికి అర్థం కాలేదు.

..... అప్ప తడకల మరుగున స్నానఁవాడుతుంటే, తను పక్కనే నిలబడింది. దాని కళ్ళల్లో పూర్వపు తళతళా, ముఖంలో ఒకప్పటి చురుకూ లేవు. ముఖం గంగ్రతేరి, మనిషి బరువుగా కనిపించింది. ఎదిగిన ఆడపిల్లలందరి వంటి రంగూ – పయ్యాట పొడుగునా తెల్లగా వుంటుంది. అప్ప వీపు, భుజాలు కూడా తెల్లగా వున్నాయి. కోఁవటి, బామ్మర్లలా రైకలేస్తాది కావాల! అందుకే! అనుకుంది... సంగి.

అంతకుమించి అప్పలో మార్పేమీ కనిపించలేదు. కాని, ఆమెనేదో నిప్పున్నూసినట్టు చూసేరందరూ – ఆమెను ముట్టుకుంటేనే, చేతులు కాల్తాయన్నట్టు; ఆమె ఇంట్లో వుంటే ఇల్లు మండిపోతుందన్నట్టు – భయపెట్టింది పెద్దమ్మ. తల్లి కూడా, ఆమెతో సమంగా భయపడింది. ఆమె దేన్ని చూసి భయపడిందో, యెందుకంత భయపడాలో అర్థం కాలేదు సంగికి.

ఆమెకు ఒక్క విషయం మాత్రం బాగా బోధపడింది.

తల్లికి, అప్పంటే ఆశ లేకపోలేదు. ఆ ఆశను కోసుకోక తప్పింది కాదు. ఆ ఆశను కోసుకోవడం చాలా బాధయ్యుండాలి. అందుకే తల్లి అంతలా ఏడ్చింది.

ఆ యేడుపు తను ఎప్పటికీ మరిచిపోలేదు. ఆ యేడుపు ఇప్పటికీ తన గుండెల్లో వినబడుతోంది.

ఆ శోకన్నం బరువు మొయ్యలేనంత కాగానే. ఆ పిల్ల చప్పున లేచి పోయింది.

★ ★ ★

ఊరికి ఆఁవడో, ఆఁవడపైనో – దూరాన ఓ "శలకుంది". నిర్మానుష్య మైన ఆ శలకలో పట్టపగలే గుండెలు పగలవేసే నిశబ్దం. నడి సముద్రం లో కనిపించే ప్రశాంతత.

ఒకసారి నీలీ, సంగీ మరికొందరు పిల్లలూ, దానికి చేరువగా వుండే తాటి తోపులోకి తేగల కోసం వెళ్ళేరు. ఆ శలకలో పట్టపగలే దెయ్యాలు తారట్లాడతాయని, దాన్నిండా పెద్ద నక్కలూ పాములూ వున్నాయనీ, పెద్ద పెద్ద మొగాళ్ళే అక్కడికొంటిగా వెళ్ళరనీ అనుకుంటారు. మరోసారి గడ్డి కోసం వెతుకుతూ ఒంటరిగా వెళ్ళింది సంగి. రెండు నిమిషాలు ఒంగొని గడ్డి కోసేసరికి, వెనకనించి వేయిపుట్ల భయం ఆమె వీపుమీద పడింది. ఎవరో వెంట తరిమినట్టు ఇంటికి పరిగెత్తింది సంగి – ఆవేళ.

ఇవేళ గడ్డిగంపా, కొడవలీ తీసుకుని, ఆ శలక్కేసే నడుస్తోంది సంగి ఒంటరిగా.

ఆమె శలక చేరుకునేసరికి, జాంవున్నర పొద్దెక్కింది. అక్కడి భయంకర మైన నిశ్శబ్దంగాని, స్మశానాల్లోని ఆ ప్రశాంతత గాని ఆమెని భయపెట్ట లేదు. మామూలుగా తోటి పిల్లల్తో పొలాల కట్టమీద గడ్డి కోసుకొంటున్నట్టే అక్కడా పని చేసుకుంటోంది.

కొంత సేపయాక –

ఎక్కడ్నించో మేక అరిచిన శబ్దం వినిపించగా లేచి నిలబడి చూసింది.

దూరాన శలక మధ్యని, ఒక తల్లి మేక మెడ రిక్కించి దిక్కులు చూస్తోంది. కొంచెంసేపు చూసేక ఒక్కడుగు కదిలి అంతలో సంగివంక తల తిప్పింది. సంగిని చూసిందో యేమో, "మేc..." అని ఓసారి అరిచి మళ్ళా మేతలో పడింది.

"నువ్వొకతె వున్నావటే నాకు తోడూ!" అంటూ సంగి గొణిగింది. ''నాకు నువ్వు తోడూ, నీకు నాన్తోడూ'' అనుకుంటూ పనిచేస్తోంది.

అకస్మాత్తుగా శలకమధ్య అలజడి వినిపించింది. లేచి చూస్తే మేక పరిగెడుతోంది. పదిగజాలు పరిగెట్టి "మేc...." అంటూ వెనక్కి తిరిగింది. ఆ వెంటనే "మేc...మేc" అంటూ రెండు మేకపిల్లల ఆర్తనాదం. శలకలో మేకల్ని ఏదో తరుముతోందనుకుంది సంగి. గడ్డి మధ్య నాలుగైదు జంతువులు అలంగం తిరుగుతున్నాయి. ఆ తరవాత ఒక మేకపిల్ల చావుకేక. ఆ వెంటనే తల్లి మేక "బే...." అంటూ బావురుమనడం.

సంగికి ఎందుకు వచ్చిందో చెప్పరాని ఆవేశం వచ్చింది. ఆమె కెక్కణ్ణుంచి వచ్చిందో చెప్పరాని ధైర్యం వచ్చింది. చేతిలో "బొరిగుంటె బాగుణ్ను"నుకుంటూ చేరువలో రాయి ఒకటి తీసుకుంది. రెండవచేతి కొడవలి గట్టిగా బట్టుకొని, శలక్కడ్డంగా పరిగెత్తింది.

సగం దూరం వెళ్ళేసరికి శలక మధ్య పాcవులా సాగే గడ్డి కదలిక కనిపించింది. ఆ కదలికకేసి తిరిగి ఆ చాలు వెంబడే పరిగెత్తింది. ముండ్ల తుప్పలూ, కటిక రాళ్ళూ – పాదాలూ, పిక్కలూ, తొడలూ నడుం వరకు మండిపోతున్నాయి.

పరిగెత్తి, పరిగెత్తి ఠక్కున ఆగిపోయింది సంగి.

తెల్లనిదీ, అక్కడక్కడ చిన్న నల్లని మచ్చలు కల్గీ, బంతిలాటిదీ, నిండా పదివారాల వయసులేనిదీ – మేకపిల్ల – నాలుక్కాళ్ళూ చాచి, "నా పని సరి" అన్నట్టు పడి వుంది.

దాని పొట్టల్లా చీల్చి, పేగులు తమ పొట్టన పెట్టుకున్నాయి. అందినంత మేరు ఆబగా అందిపుచ్చుకుని – అలికిడి వినగానే పారిపోయాయి.

"బేc... బేc... బేcc" అంటూ భయం నిండిన కళ్ళలో, ముందుకు సాగని కాళ్ళతో వస్తోంది తల్లి మేక. మధ్య మధ్య ఆగి దిక్కులు చూసుకుంటూ వస్తోంది తల్లి మేక.

అలా వచ్చివచ్చి తన పిల్లనీ, చేరువనే మనిషి పిల్లనీ చూసి ఆగి పోయింది. సంగి పక్కకు తప్పుకోగానే పిల్ల దగ్గిరికి జంకుతూ వెళ్ళి, బెదురు బెదురుగా మూ చూసింది. ఆ వెంటనే ఎగిరి ఎగిరి పడుతూ వచ్చిన రెండో మేకపిల్ల మూ చూస్తున్న తల్లినీ, ఎదురుగా ఎండలో చచ్చిపడి వున్న పిల్లనీ ఓరగా చూస్తూ నిలబడిపోయింది.

హృదయ విదారకమైన ఆ రెండిటి అరుపులూ విన్న సంగికి. వాటి కళ్ళలో కనిపించే దిక్కుమాలినతనం చూడగానే, విపరీతమైన జాలికలిగి కన్నులు జేవురించేయి.

''మాయముండల్లారా! రాకాసి ముండల్లారా! మీ పనిసెపతా నుండండి" అంటూ చుట్టూ చూసింది సంగి. ఎండిపోయిన తాటిమట్ట ఒకటి తప్ప ఇంకే ఆయుధమూ దొరకలేదు ఆ పిల్లకు. "యియ్యేళ మిమ్మల్ని, ఒకళ్ళనో ఇద్దర్నో సంపిందాకా నా నింటికిపోను'' అంటూ ఆ మట్టనే ఎడంచేతిలోకి తీసుకుని శలక కడ్డంగా బయల్దేరింది. కనిపించిన తుప్పల్లా కమ్మమట్టతో కొడుతూ "కనిపించండి ముండల్లారా" అంటోంది కనిపించని నక్కల్నుద్దేశించి.

చిన్నదీ, లోకం తీరెరగనిదీ – సంగి. ఆవేశమొస్తే వూగిపోవడమే తప్ప ఆలోచనలు పోయే అలవాటు లేదా పిల్లకు.

అందుచేతే "తనకు పట్టనిబాధ – ఎవరికో జరిగిన అన్యాయం" అనకుండా ఆ యెండవేళ నక్కల కోసం వెతుకుతోంది.

నక్కలు తనకు చిక్కుతాయా. అసలెక్కడ చిక్కుతాయ్? చిక్కితే తనేం చేయగల్దు? – ఇలాంటి ప్రశ్నలామెకు తట్టలేదు. తట్టవు కూడా.

ఆమె ఆవేశం మనకు అర్థం కావాలంటే ఆమె స్థానంలో మనముండాలి – అంతేకాదు? ఆమె గుండె కూడా మనకుండాలి. ★

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 7, నవంబరు 1968)*